ఈ లైబ్రరీని పట్టించుకోండి

- 1982లో లాల్‌బహదూర్ శాస్త్రి గ్రంథాలయం ప్రారంభం
- పాఠకులకు అందుబాటులో 4,329కి పైగా పుస్తకాలు
- క్యాన్సర్ రోగులకు ఆర్థిక సాయం
- ప్రస్తుతం సమస్యల వలయంలో చిక్కి విలవిల


లాల్‌బహదూర్ శాస్త్రి గ్రంథాలయ భవన్


లైబ్రరీలో పాఠకులు

యూసుఫ్‌గూడ, మే 9 (ఆంధ్రజ్యోతి): పుస్తకపఠనం, సమాజ సేవపై ఆసక్తి ఉన్న కొన్ని ప్రైవేట్ సంస్థలు ఇంకా గ్రంథాలయాలను పాఠకులకు అందుబాటులో ఉంచుతున్నాయి. అందులో భాగంగానే శ్రీకృష్ణానగర్‌లోని లాల్ బహదూర్‌శాస్త్రి సేవానికేతన్ గ్రంథాలయాన్ని 1982లో స్థాపించారు. పాఠకుల కోసం ప్రస్తుతం 4,329కి పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఇందులో తెలుగు నవలలు-3,409, ఇంగ్లిష్ పుస్తకాలు-680, ఉర్దూ పుస్తకాలు-140, హిందీ పుస్తకాలు-100. వీటితో పాటు 9 దినపత్రికలు, 5 వార పత్రికలు, 12 మాసపత్రికలు పాఠకులకు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి.

11 ఏళ్లుగా నో గ్రాంట్..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గుర్తింపు పొందిన గ్రంథాలయాలకు హైదరాబాద్ సిటీ గ్రంథాలయ సంస్థ(హెచ్.సి.జి.ఎస్) రూ.10 వేల గ్రాంట్‌ను ఇచ్చేది. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో 2014 ఏప్రిల్ నుంచి గ్రాంట్‌ను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 11 ఏళ్లుగా గ్రంథాలయ సిబ్బంది వేతనాలు, గ్రంథాలయ ఖర్చులను బరాయిస్తూ నెట్టుకొస్తున్నారు. గ్రంథాలయ నిర్వహణలో ఉన్న భవనానికి జీహెచ్‌ఎంసీ ప్రాపర్టీ ట్యాక్స్‌లో 8 శాతం ఉన్న రాయితీ కూడా ఇవ్వడం లేదు. సేవా దృక్పథంతో నడుస్తున్న గ్రంథాలయానికి కమర్షియల్ కరెంట్ మీటర్‌ను విద్యుత్ అధికారులు అమర్చారు. దీంతో కరెంట్ బిల్లు కూడా అధిక మొత్తంలో వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత కరెంట్ లైబ్రరీలకు అందించాలని పాఠకులు కోరుతున్నారు.

ఉచిత యోగా.. క్యాన్సర్ రోగులకు సాయం

లాల్ బహదూర్ శాస్త్రి సేవానికేతన్‌లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షల సమయంలో అభ్యర్థుల కోసం అదనంగా గంటసేపు తెరిచి ఉంచుతున్నారు. 2010లో ప్రారంభించిన యోగా సెంటర్‌లో ఉదయం 5:30 నుంచి 6:30 వరకు ఉచితంగా యోగా తరగతులను నిర్వహిస్తున్నారు. క్యాన్సర్ బారిన పడిన పేద రోగులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు అలాగే వివిధ రకాల జబ్బులకు ఉచిత వైద్యం అందిస్తున్నారు.

గుర్తింపు పొందిన గ్రంథాలయాలకు నిధులు ఇవ్వాలి



లాల్ బహదూర్ శాస్త్రి సేవానికేతన్ గ్రంథాలయంలో 42 సంవత్సరాలుగా పాఠకులకు విజ్ఞానాన్ని అందిస్తున్నాం. 2014 నుంచి గుర్తింపు పొందిన లైబ్రరీలకు అందిస్తున్న పది వేల రూపాయల గ్రాంట్‌ను నాటి ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ నిలిపివేశారు. ఈ గ్రాంట్‌ను పునరుద్ధరించి 40 వేలకు పెంచి ఇవ్వాలి. గ్రంథాలయాల కరెంట్ మీటర్ కమర్షియల్ క్యాటగిరిగా ఉంది. దీనిని డొమెస్టిక్‌గా మార్చి 200 యూనిట్ల కరెంట్‌ను ఉచితంగా ఇవ్వాలి. ఇప్పటికే సమస్యలపై హైదరాబాద్ సిటీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశాం.

- ఎస్టీ ఇక్బాల్ అహ్మద్, లాల్ బహదూర్ శాస్త్రి సేవానికేతన్ గ్రంథాలయ కోశాధికారి

పిల్లలు సెల్ మాయలో ఉన్నారు



డిజిటల్ తరగతుల నిర్వహణ పేరుతో పాఠశాలలోనే పిల్లలకు ఫోన్ వాడమని చెబుతున్నారు. కరోనా తర్వాత పిల్లలు సెల్‌ఫోన్ మాయలో ఉన్నారు. సెల్‌ఫోన్ వాడడం వల్ల పిల్లల్లో బుద్ధిమాంద్యం పెరిగింది. అనారోగ్య సమస్యలు పెరిగాయి. ఇంట్లో తల్లిదండ్రులు పిల్లలకు ఆన్‌లైన్ చదువులు, సెల్‌ఫోన్ వాడకాన్ని నిలిపివేసి పుస్తకాలు చదివించాలి. విజ్ఞానంతో పాటు పేద క్యాన్సర్ రోగులకు ఆర్థిక సహాయం అందిస్తున్నాం. ట్రస్ట్ నుంచి వైద్యం ఉచితంగా అందిస్తున్నాం.

- కెఎల్‌ఎన్‌రెడ్డి, పూర్వ గ్రంథపాలకుడు

తట్టిఖాన సెక్షన్ ఆఫీస్ తనిఖీ చేసిన ఈడీ

హైదరాబాద్ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు ఎస్‌ఆర్‌నగర్ డివిజన్-6 పరిధిలోని తట్టిఖాన సెక్షన్ ఆఫీస్‌ను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో ట్యాంకర్ డిమాండ్ అధికంగా ఉన్న.. తట్టిఖాన సెక్షన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి?, ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఎంసీసీ ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.


ఓల్డ్ సుల్తాన్‌నగర్‌లో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, మే 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్ ఓల్డ్ సుల్తాన్‌నగర్‌లో రూ. 70 లక్షల నిధులతో చేపట్టనున్న రోడ్డు పనులను ఆయన అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేసవికాలంలో తాగునీటి కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ భానుచందర్, ఏఈ భరత్ కుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఖురేషి, ఓల్డ్ సుల్తాన్‌నగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొట్ల విజయ్ కుమార్, చైర్మన్ రాంచందర్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జావెద్, దాసి శ్రీకాంత్, అజీమ్, నాగేశ్వరరావు, శ్రావణ్ పటేల్, కళ్యాణి, ఉష, లక్ష్మి, శ్రీలేఖ, ఏలేశ్వరరావు, రాజు తరుణ్, రవి, చందు, అశోక్, సయ్యద్ రసూల్, శివ, గంటా కృష్ణ, చంద్రశేఖర్, అన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ లక్ష్మీనారాయణస్వామి కల్యాణం


లక్ష్మీనారాయణుల ఉత్సవ విగ్రహాలు

బోరబండ, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్-2 శ్రీ కనకదుర్గా భవానీ ఆలయ ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి, రుద్ర కల్యాణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. దేవతా రూపాలైన అశ్వథ వృక్షం(రావి), నింబ(వేప), వట వృక్షం(మర్రిచెట్టు), వేపచెట్లకు వేదపండితులు మంత్రోచ్ఛరణలతో కల్యాణం జరిపించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి స్థానిక సాయిబాబా ధ్యానకేంద్రంలో గణపతి విగ్రహం, షిర్డీ సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించారు. బస్తీలో కొత్తగా వేసిన బోరుబావిని ప్రారంభించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలోని మర్రి, రావి, జువ్వి, వేప చెట్లు త్రిమూర్తులు, శక్తికి ప్రతీక అని ఆలయ ధర్మకర్త వేముల యాదయ్య తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం కల్యాణం నిర్వహించామని, ఈ సందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహాన్ని వృక్షాల నీడలో ప్రతిష్ఠించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

యూసుఫ్‌గూడ, మే 9 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలరెడ్డి రహ్మత్‌నగర్‌లో ఉంటున్నాడు. భార్య వెంకటేశ్వరి పది రోజుల క్రితం కర్నూలుకు వెళ్లింది. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో అదే బిల్డింగ్‌లో ఉంటున్న కాంతారావుకు ఫోన్ చేసింది. తిరుమలరెడ్డితో మాట్లాడించాలని కోరింది. కాంతారావు తిరుమలరెడ్డి గదికి వెళ్లి చూడగా తలుపులు బిగించి, కిటికీలు తెరిచి ఉన్నాయి. బెడ్ షీట్ కప్పుకొని కింద పడి ఉన్నట్టు కనిపించాడు. పిలిస్తే తలుపులు ఎంతకూ తీయకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు తీసి చూడగా మృతిచెంది ఉన్నాడు. భార్య వెంకటేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సైనిక ఉద్యోగి..

యూసుఫ్‌గూడ, మే 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మాజీ సైనిక ఉద్యోగి మృతిచెందాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావునగర్‌కు చెందిన మాజీ సైనిక ఉద్యోగి బి.సంజయ్‌రావు వైద్య పరీక్షల కోసం శుక్రవారం ఆస్పత్రికి బైక్‌పై బయలుదేరారు. ఎస్‌ఆర్‌నగర్‌లో యూటర్న్ తీసుకుంటూ బండి పై నుంచి జారి కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. భార్య అన్నపూర్ణకు సమాచారం అందించగా, ఆమె కుమారుడు చంద్రమోహన్ వచ్చి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని చెప్పారు.

బెనిన్ గైనకాలజీ విభాగంలో వెయ్యికి పైగా రోబోటిక్ శస్త్ర చికిత్సలు

- అపోలో ఆస్పత్రి వైద్యురాలి ఘనత


మాట్లాడుతున్న అపోలో ఆస్పత్రుల గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా.సంగీతరెడ్డి

బంజారాహిల్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): బెనిన్ గైనకాలజీ వైద్య చికిత్సలో వెయ్యి కంటే ఎక్కువ రోబోటిక్ సర్జరీలు చేసి జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రూమా రికార్డు సృష్టించారు. దేశంలోనే అత్యధిక సర్జరీలు చేసిన వైద్యురాలిగా నిలిచారు. జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అపోలో గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతరెడ్డి వైద్యురాలిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీలతో రోగులకు సత్వర ఉపశమనం కలుగుతుందన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ, వారి జీవన ప్రమాణాలను ఎలా మెరుగుపరచగలమో డా.రూమా ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. ఆస్పత్రి సీఈఓ తేజస్వీరావు మాట్లాడుతూ నూతన సాంకేతికతలను స్వీకరించడం, తగినస్థాయిలో అమలు పరచడం ద్వారా అపోలో జూబ్లీహిల్స్ ఆస్పత్రి తన స్థాయిని పెంచుకుందన్నారు. రోబోటిక్ గైనకాలజీలో డాక్టర్ రూమా సునిశితమైన విషయాలపై దృష్టి సారించి విజయం సాధించారని తెలిపారు.

సెల్‌ఫోన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

పంజాగుట్ట, మే 9 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై డబ్బుల కోసం రాత్రి వేళల్లో ద్విచక్రవాహనాలపై తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్న వారి సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేస్తున్న ఓ ముఠాను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ముఠా సభ్యుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన జావీద్ స్విగ్గీ డెలివరీ బాయ్. ఈనెల 4న అర్ధరాత్రి బేగంపేట నుంచి పంజాగుట్ట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. బేగంపేట లైఫ్ స్టైల్ బిల్డింగ్ ఎదురుగా ఫ్లై ఓవర్ దిగిన తర్వాత ఫోన్‌లో చిరునామా చూస్తుండగా వెనకాల నుంచి ద్విచక్ర వాహనాలపై వచ్చిన అగంతకులు అతడి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. జావీద్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా వాహనం నెంబర్ గుర్తించారు. వాటి ఆధారంగా బొడుప్పల్ ఫీర్జాదిగూడకు చెందిన ప్రమోద్(21), శ్రావణ్(20), రాజేష్(21)ను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఈనెల 4న బేగంపేటలో సెల్‌ఫోన్ స్నాచింగ్ చేసిన తర్వాత వారు మాదాపూర్ వెళ్లామని అక్కడ రహదారిపై వెళ్తున్న వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేసినట్టు అంగీకరించారు. అదే ప్రాంతంలో తాము వచ్చిన రెండు వాహనాలలో ఓ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకుని డబ్బులు ఇవ్వకుండా పారిపోయినట్టు కూడా విచారణలో పోలీసులకు తెలిపారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న ముఠా సభ్యుడు మహేష్(20) కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేడు టీజీఆర్‌జేసీ టెస్ట్

బోరబండ, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలల అర్హత పరీక్ష శనివారం జరగనున్నట్లు బోరబండ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ గోపిశెట్టి రమణమ్మ తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఉంటుందని ఆమె తెలిపారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, మే 9 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 11 కేవీ బేగంపేట కామత్ లింగాపూర్ హౌస్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, రాజీవ్‌నగర్, బంజారాహిల్స్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ ప్రభుత్వ ఆస్పత్రి, ఎస్.వి.ఎస్ టెంపుల్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

అక్టోబరు 12న గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్-2025

హైటెక్ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధి నివారణలో భాగంగా గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన రన్ నిర్వహిస్తున్నట్టు డాక్టర్ చినబాబు సుంకవల్లి తెలిపారు. అక్టోబరు 4న గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్-2025 పేరుతో ప్రపంచవ్యాప్తంగా 130 దేశాల్లో వర్చువల్ రన్ జరుగుతుందని ఆయన తెలిపారు. వర్చువల్ అవగాహనలో 2లక్షల మంది పాల్గొంటారని, అదే రోజు గచ్చిబౌలిలో జరిగే ఫిజికల్ రన్‌లో సుమారు 30 వేల మంది పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఐఏఎస్ అలుగు వర్షిణి, మిస్ ఇండియా శిల్పారెడ్డి అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. 2కె, 5కె, 10కె రన్‌లో పాల్గొనే వారు www.gracecancerrun.com అనే వెబ్‌సైట్లో తమ పేర్లను నమోదు చేసుకొని ఫీజు చెల్లించాలని నిర్వాహకులు తెలిపారు. ఈ పరుగు ద్వారా వచ్చే నిధులతో లక్ష మందికి మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందిస్తామని తెలిపారు.

'జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలని నిరుద్యోగ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలోని అంబేడ్కర్ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు శుక్రవారం ర్యాలీ తీసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, రమేష్‌గౌడ్, మధు, సైదులు, వెంకటేష్ పాల్గొన్నారు.

అందుబాటులోకి మరో నైట్ క్లబ్

హైదరాబాద్ సిటీ, మే9(ఆంధ్రజ్యోతి): నైట్‌లైఫ్‌ను అమితం గా అభిమానించే నగరవాసుల కోసం మరో నైట్ క్లబ్ అందుబాటు లోకి వచ్చింది. జూబ్లీహిల్స్‌లో గురువారం రాత్రి నాక్స్ క్లబ్ ప్రారంభ మైంది. బిగ్‌బాస్ ఫేమ్ సన్నీతో పాటుగా వర్ధమాన నటులు సమీర్, రాజ్, కీర్తి తదితరులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.





నాక్స్ క్లబ్ ప్రారంభోత్సవంలో బిగ్‌బాస్ ఫేమ్ సన్నీతో పాటు వర్ధమాన నటులు

పీవోకే స్వాధీనంతోనే ఉగ్రమూకల కట్టడి సాధ్యం

- మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ


మాజీ ఎమ్మెల్యే ప్రసూన

అమీర్‌పేట, మే 9 (ఆంధ్రజ్యోతి): పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీవోకే)ని భారత్ సైన్యం స్వాధీనం చేసుకుంటేనే జైషే మహ్మద్, లష్కరే తోయిబా ఉగ్రమూకల కట్టడి సాధ్యమవుతుందని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన అన్నారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ జెండా చేబూని 'మేరా భారత్ మహాన్, నరేంద్ర మోదీ జిందాబాద్, భారత్ సైనికులకు పాదభివందనాలు' అనే నినాదాలతో హోరెత్తించారు. సైనికుడి కూతురుగా చెబుతున్న ఆపరేషన్ సిందూర పేరుతో భారత ప్రభుత్వం చేపట్టిన యుద్ధాన్ని యావత్ భారతావని ప్రశంసిస్తుందన్నారు. దశాబ్దాల కాలంపాటు భారత్‌పై పాకిస్థాన్ చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను రాజనీతితో ఎదుర్కొంటున్న సైన్యం, ప్రధాని మోదీకి శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు.

పౌరులు అప్రమత్తంగా ఉండాలి

అమీర్‌పేట, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో పౌరులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు సూచించారు. అసాంఘీక శక్తుల సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని, వదంతులను నమ్మవద్దని కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆలయాలు, మసీదుల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో కలిసి ఏసీపీ బాలగంగిరెడ్డి మాట్లాడారు. ప్రార్థనాలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, కాపలాదారులను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆలయాలు, మసీదులు, చర్చీల నిర్వాహకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ బాలగంగిరెడ్డి

యుద్ధంలో భారత్ గెలవాలని పూజలు


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

బంజారాహిల్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో భారత దేశం అన్నిరంగాల్లో రాణించి శత్రు సేనలను తుద ముట్టించి విజయం సాధించాలంటూ శ్రీనగర్‌కాలనీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం అనువిధంగా మృత్యుంజయ మహామంత్రాలతో కార్యక్రమం నిర్వహించినట్లు వేద పండితులు జ్యోతిశ్చంద్ర శర్మ తెలిపారు. ఆలయ ఈవో శ్రీనివాస శర్మ నేతృత్వంలో ఆలయ అర్చకులు, వేద పండితులు శంభు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆదేశానుసారం ఆలయాలు సైతం దైవభక్తితో పాటు, దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో దేశం కోసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు సైతం పూజా వివరాలను తెలుసుకొని పాల్గొంటూ దేశభక్తిని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీర హనుమాన్ ఆలయంలో..

బేగంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో ధైర్యంగా పోరాడుతున్న భారత సైనికులకు మద్దతుగా ఎస్పీరోడ్డులోని శ్రీ వీర హనుమాన్ ఆలయంలో ఈవో శ్రీనివాసశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ప్రధాన పూజారి భద్రినాథ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు క్రికెట్‌లో మెలకువలు నేర్పుతున్న కోచ్ హర్భజన్‌సింగ్ సంధు



బాస్కెట్‌బాల్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్ నయీముద్దీన్

సందడిగా క్రీడా ప్రాంగణాలు

అమీర్‌పేట, మే 9 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాంగణాలు విద్యార్థులతో సందడిగా మారాయి. అమీర్‌పేటలోని శ్రీ గురుగోవిందసింగ్ మల్టీపర్పస్ స్టేడియం, ధరంకరం రోడ్డులోని జీహెచ్‌ఎంసీ మైదానం, ఎస్‌ఆర్‌నగర్ వాటర్‌ట్యాంక్ సమీపంలోని జీహెచ్‌ఎంసీ మైదానంలో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, జిమ్, జిమ్నాస్టిక్స్, కరాటే, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, చదరంగం, రోలర్ స్కేటింగ్, హాకీ తదితర క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లు శిక్షణ ఇస్తున్నారు. కొన్నిచోట్ల యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. వీటిని జీహెచ్‌ఎంసీ క్రీడా విభాగం ఇన్‌స్పెక్టర్ మాధవి పర్యవేక్షిస్తున్నారు.

బాస్కెట్‌బాల్ కోర్టు వద్ద బారులు..

ఎస్‌ఆర్‌టీకాలనీలోని బాస్కెట్‌బాల్ కోర్టులో విద్యార్థులు బారులు తీరుతున్నారు. తెల్లవారుజామునే ఇక్కడకు చేరుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ కోచ్ జాతీయ ఆటగాడు మహ్మద్ నయీముద్దీన్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతోంది. మహ్మద్ సయాద్ ఇమ్రోజ్, విష్ణు తదితర కోచ్‌లు శిక్షణలో సహకారం అందిస్తున్నారు. ఇక రోలర్ స్కేటింగ్‌లో శిక్షణ పొందే చిన్నారులతో జీహెచ్‌ఎంసీ గురుగోవింద్‌సింగ్ స్టేడియం సందడిగా మారింది. కోచ్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులకు స్కేటింగ్ శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ స్టేడియంలో బ్యాడ్మింటన్, చదరంగం, క్యారమ్స్, జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో హాకీ, కరాటేలో శిక్షణ కొనసాగుతోంది. జూన్ 6వ తేదీ వరకు వేసవి క్రీడా శిబిరాలు కొనసాగుతాయని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు.



ప్రజాభవన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న చిన్నారెడ్డి, దివ్య

సీఎం ప్రజావాణికి 221 దరఖాస్తులు

బేగంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి మొత్తం 221 దరఖాస్తులు వచ్చాయి. ల్యాబ్ టెక్నీషియన్స్ తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజావాణిలో చిన్నారెడ్డి, దివ్యను కోరారు. వెంటనే సంబంధిత అధికారులతో చిన్నారెడ్డి ఫోన్‌లో మాట్లాడి సమస్యను ఒక కొలిక్కి తీసుకొచ్చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 64, హోంశాఖకు 10, రెవెన్యూకు 26, మున్సిపల్‌కు 10, ఇందిరమ్మ ఇండ్లకు 64, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇతర శాఖలకు సంబంధించిన 46 దరఖాస్తులు వచ్చాయని ప్రజావాణి అధికారి తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.



తాడుబందు వీరాంజనేయస్వామి దేవస్థానం హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

వీరాంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు

బోయినపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని తాడ్‌బందు వీరాంజనేయస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శుక్రవారం పూర్తయింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఏ.నరేందర్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అండాలు, బోయినపల్లి పోలీస్‌ల పర్యవేక్షణలో దేవస్థానం హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా హుండీలో నోట్ల రూపంలో రూ.28,22,988 లక్షలు నాణేలా రూపంలో రూ.1,84,600.00 లక్షలు, మొత్తం 30లక్షలా7,588 రూపాయలు వచ్చాయని, అంతేకాకుండా విదేశీ కరెన్సీ రూపంలో 5 కెనడా డాలర్స్, 130 యూరప్ డాలర్ల రూపంలో విరాళాలు వచ్చినట్లు ఆలయ ఈఓ నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, సిబ్బంది, భక్తులు, దాతలు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీత రాఘవేంద్ర రాజును సత్కరిస్తున్న టీజేఈయూ కార్యవర్గం

రాఘవేంద్ర రాజుకు సత్కారం

మారేడుపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులు శ్రమ పట్ల గౌరవం చాటే మే డే నాడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించిన గౌరవ కార్మిక శక్తి అవార్డును టీజేఈయూ కార్యవర్గం రాఘవేంద్రరాజు అందుకున్న సందర్భంగా శుక్రవారం మారేడుపల్లిలోని జలమండలి కార్యాలయంలో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్వర్యంలో ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.దేవేందర్, అజయ్‌నాథ్, టి.రాజు, శివ శంకర్, కె.స్వామి, బి.మహేష్, పరమేష్, దేవదాస్, ప్రవీణ్, రాజు, హరిశ్చంద్ర ప్రసాద్, వేణు గోపాల్, మన్మధరావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

వారాసిగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పురేందర్‌రెడ్డి



బౌద్ధనగర్, మే9 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌జోన్ పరిధిలోని వారాసిగూడ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.పురేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన అఫ్జల్‌గంజ్, చాంద్రాయణగుట్ట, హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహించి స్పెషల్‌బ్రాంచ్ (ఎస్‌బీ)కి బదిలీ అయ్యారు. హైదరాబాద్ ఎస్‌బీ నుండి వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌కు డీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వేసవి సెలవుల్లో ఊళ్లలోకి వెళ్లేవారు పోలీస్‌స్టేషన్లో సమాచారమివ్వాలని సూచించారు.



నూతన ట్రోఫీలు, కళ్లద్దాలు పెట్టుకుని విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

ట్రాఫిక్ పోలీసులకు ట్రోఫీలు, కళ్లద్దాలు

బౌద్ధనగర్, మే9 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బందికి నూతన ట్రోఫీలు, కళ్లద్దాలు, వాటర్ కిట్ బ్యాగులను అందజేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీధర్ సిబ్బంది శుక్రవారం మెట్టుగూడ, ఆలుగడ్డబావి, చిలకలగూడ, సీతాఫల్‌మండి తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. వీటి ద్వారా ఎండవేడిని తట్టుకుని సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తారని శ్రీనివాసులు తెలిపారు.

సెల్‌ఫోన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

పంజాగుట్ట, మే 9 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై డబ్బుల కోసం రాత్రి వేళల్లో ద్విచక్రవాహనాలపై తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్న వారి సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేస్తున్న ఓ ముఠాను పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ముఠా సభ్యుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. యూసుఫ్‌గూడకు చెందిన జావీద్ స్విగ్గీ డెలివరీ బాయ్. ఈనెల 4న అర్ధరాత్రి బేగంపేట నుంచి పంజాగుట్ట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. బేగంపేట లైఫ్ స్టైల్ బిల్డింగ్ ఎదురుగా ఫ్లై ఓవర్ దిగిన తర్వాత ఫోన్‌లో చిరునామా చూస్తుండగా ద్విచక్ర వాహనాలపై వచ్చిన అగంతకులు అతడి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. జావీద్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా వాహనం గుర్తించారు. వాటి ఆధారంగా బొడుప్పల్ ఫీర్జాదిగూడకు చెందిన ప్రమోద్(21), శ్రావణ్(20), రాజేష్(21)ను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించారు. ఈనెల 4న బేగంపేటలో సెల్‌ఫోన్ స్నాచింగ్ చేసిన తర్వాత మాదాపూర్ వెళ్లి అక్కడ వెళ్తున్న వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేసినట్టు అంగీకరించారు. అదేప్రాంతంలో రెండు వాహనాలలో ఓ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకుని డబ్బులు ఇవ్వకుండా పారిపోయినట్టు కూడా తెలిపారు. పరారీలో ఉన్న ముఠా సభ్యుడు మహేష్(20) కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎప్పుడు కూలుతుందో ఏమో..!

- శిథిలావస్థలో సికింద్రాబాద్ పౌరసరఫరాల భవనం
- భయం భయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- కార్యాలయాన్ని మార్చాలని స్థానికుల వినతి



పౌరసరఫరాల శాఖ కార్యాలయ భవనం

రెజిమెంటల్ బజార్, మే 9 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సహాయ పౌరసరఫరాల అధికారి 9వ సర్కిల్ కార్యాలయం శిథిలావస్థలో ఉండడంతో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయాన్ని వేరే భవనంలోకి మార్చాలని ఇక్కడ పనిచేసే సిబ్బంది అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. పురాతన భవనం కావడంతో మోస్తారు వాన పడితే చాలు పై కప్పు కారడం, పెచ్చులూడి పోవడం జరుగుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే సిబ్బంది ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికే ప్రమాదకరంగా కూలిపోయే అవకాశం ఉన్న భవనంగా దీనిని గుర్తించి జీహెచ్ఎంసీ నోటీస్ కూడా ఇచ్చింది. అయినప్పటికి 16 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా.. పౌర సరఫరాల శాఖ కార్యాలయం అలాగే కొనసాగుతోంది.

1968లో లైబ్రరీ ప్రారంభం

మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ 1968 సంవత్సరంలో అప్పటి మేయర్ కొండారెడ్డి ప్రస్తుతం ఉన్న భవనంలో మున్సిపల్ లైబ్రరీని ప్రారంభించారు. 1985 ముందు వరకు లైబ్రరీ ఉండేది. స్థానికులు వెళ్లి వార్తా పత్రికలు చదువుకునే వారు. తర్వాత పౌరసరఫరాల కార్యాలయం ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీకి పౌరసరఫరాల శాఖ అద్దె చెల్లిస్తుందని స్థానికులు తెలిపారు. ఈ సర్కిల్ కార్యాలయం పరిధిలో 53 రేషన్ దుకాణాలు ఉండగా.. 53,793 మంది కార్డుదారులు ఉన్నారు.

గతంలో కూలిన ఓల్డ్ జైల్‌ఖానా గోడ

గత ఏడాది ఇదే మోండా డివిజన్ పరిధిలో ఓల్డ్ జైల్‌ఖానా గోడ కూలి ఆరు టైలరింగ్ దుకాణాలు కూలిపోయాయి. అప్రమత్తమైన దర్జీలు బయటకు పరిగెత్తడంతో ప్రాణాపాయం తప్పింది. అలాంటి సంఘటన చోటుచేసుకోక ముందే పౌరసరఫరాల శాఖ కార్యాలయాన్ని తాత్కాలికంగా వేరే భవనంలోకి తరలించాలని స్థానికులు, సిబ్బంది కోరుతున్నారు.

నోటీస్‌లు ఇవ్వడం కాదు.. తొలగించాలి



ప్రమాదకరంగా శిథిలావస్థలో ఉన్న ప్రైవేట్, ప్రభుత్వ భవనాలను జీహెచ్ఎంసీ శాఖ గుర్తించి వారికి నోటీస్‌లు జారీ చేస్తున్నారు. అయితే కొంత మంది ఆర్థిక పరిస్థితులు బాగాలేక వాటిలోనే నివసిస్తున్నారు. అలాంటి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఖాళీ చేసేలా చర్యలు తీసుకొని భవనాలను తొలగించాలి.

- వీరేష్, రెజిమెంటల్ బజార్

భయం భయంగా ఉంటున్నాం



భవనం పాతది కావడంతో వర్షం పడినప్పుడు స్లాబు లీకయి గోడలు తడిసి పోతున్నాయి. పెచ్చులు ఊడుతున్నాయి. వానాకాలం కావడంతో ఎప్పుడు కూలిపోతుందేనని భయం వేస్తూ ఉంటుంది. జీహెచ్ఎంసీ వారు నోటీస్ కూడా ఇచ్చారు. వేరే భవనంలోకి మారిస్తే బాగుంటుంది.

- చాముండేశ్వరి, ఏసీఎస్‌ఓ

కమ్యూనిటీ హాల్‌లోకి మార్చాలి



పెచ్చులూడుతున్న పై కప్పు

రెజిమెంటల్ బజార్ పరికిబస్తీలో నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ హాల్‌లోకి పౌర సరఫరాల శాఖ కార్యాలయాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు. మార్చడం వలన రేషన్ కార్డుదారులకు కూడా అందుబాటులో ఉంటుంది. బస్‌స్టాండ్‌తో పాటు ఆటో రవాణా సౌకర్యం ఉండటంతో కార్యాలయంకు వచ్చే వారికి సౌకర్యంగా ఉంటుంది.

ఆర్టీఐ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారు..

విశ్రాంత డీఎస్పీపై నార్త్‌జోన్ డీసీపీ ఫిర్యాదు

మారేడుపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం) చట్టాన్ని దుర్వినియోగం చేయడంతో పాటు.. పోలీస్ అధికారుల విధులకు ఆటంకాలు కలిగిస్తున్నారని.. విశ్రాంత డీఎస్పీపై ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ ఈ నెల 7న మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... మారేడుపల్లికి చెందిన మాజీ డీఎస్పీ నెల్సన్ ఆర్టీఐ చట్టం కింద నార్త్ జోన్ డీసీపీ కార్యాలయానికి ఒక దరఖాస్తు చేశాడు. తన కుమారుడు సచంద్ర అనురాగ్‌కు చెందిన రెన్యూవల్ చేయని ఆయుధం లైసెన్స్ బుక్ ప్రతిని ఇవ్వాలని దరఖాస్తులో పేర్కొన్నాడు. అనురాగ్ ఆయుధ లైసెన్స్ రెన్యువల్ కోసం చెల్లించిన నగదును తిరిగి చెల్లించాలని కోరాడు. అందుకు పోలీసులు స్పందించి సమాచారం పంపారు. సచంద్ర అనురాగ్, నెల్సన్ మరో కుమారుడు సందీప్‌పైనా మూడు కేసులు ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. అందుకే అతని ఆయుధ లైసెన్స్‌ను రెన్యువల్ చేయలేదని తెలియజేస్తూ సమాచారం పంపారు. అయినా సంతృప్తి చెందని నెల్సన్.. నార్త్‌జోన్ పోలీసులు సరైన సమాచారం ఇవ్వడంలేదంటూ నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. దాంతో పదే పదే ఆర్టీఐ దరఖాస్తు చేస్తూ పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తున్న విశ్రాంత డీఎస్పీపై డీసీపీ పెరుమాళ్ మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో రాజస్థాన్ వాసి అదృశ్యం



సుభం జంగీర్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ నుంచి రైలులో చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో దిగిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. సికింద్రాబాద్ రైల్వే ఎస్సై మాజీద్ వివరాల ప్రకారం.. రాజస్థాన్ కేత్రీనగర్ బాంవాస్ దానా ప్రాంతానికి చెందిన సుభం జంగీర్ (28) హయత్‌నగర్‌లో కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. రాజస్థాన్‌కు వెళ్లిన జంగీర్ హైదరాబాద్‌లో ఉన్న తన బంధువులకు ఈనెల 7న చర్లపల్లిలో రైలు దిగి వస్తానని తెలిపాడు. తీరా 7న చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో రైలులో రాలేదని తెలుసుకున్న సోదరుడు సునిల్ కుమార్ ఆయా ప్రాంతాల్లో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో వెంటనే 9న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జంగీర్‌పై మిస్సింగ్ కేసు కింద ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త మృతిపై అనుమానాలు?

న్యాయం చేయాలని పోలీసులకు భార్య ఫిర్యాదు

అడ్డగుట్ట, మే 9 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడ్డగుట్టకు చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో తన సోదరి ఇంట్లో చనిపోయాడని భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం.. అడ్డగుట్టకు చెందిన బ్రహ్మచారి (47) గోల్డ్‌స్మిత్ వ్యాపారం చేస్తుంటాడు. అతనికి భార్య అనూష, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈనెల 3న వినాయక్‌నగర్‌లో ఉంటున్న అక్క పద్మ ఇంటికి వెళ్లాడు. 7న అక్క ఇంట్లో మరణించాడు. అక్క పద్మ మల్కాజిగిరి పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ క్రమంలో బ్రహ్మచారి చనిపోయాడని మార్చురీకి తరలించిన అనంతరం మృతుని భార్యకు పద్మ సమాచారం ఇచ్చింది. అడ్డగుట్ట నుంచి ఆరోగ్యంగా ఉన్న భర్త అక్క దగ్గరికి వెళ్లిన తరువాత ఎలా చనిపోయాడు.. మార్చురీకి తరలించిన తరువాత తనకు సమాచారం ఇవ్వడం ఏమిటని తన భర్త మృతిపై భార్య మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక కేసు దర్యాప్తు చేస్తామని వారు ఆమెకు నచ్చజెప్పి పంపించారు. భర్త మృతిపై దర్యాప్తు చేసి తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసుల్ని వేడుకుంది.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పూజలు



గణేష్ టెంపుల్‌లో పూజలు నిర్వహిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, తదితరులు

రెజిమెంటల్ బజార్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు చేశారు. ఇలాంటి కీలకమైన సమయంలో పార్టీలకు అతీతంగా దేశం అంతా ఒక్కటైందన్నారు. 140 కోట్ల మంది ప్రజల ప్రార్థనలతో పాటు దేవుడి ఆశీస్సులు సైన్యానికి ఉండాలని శత్రువులపై విజయం సాధించాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. పూజల్లో కాంగ్రెస్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్, తదితరులు ఉన్నారు.

బొల్లారం డౌటన్ బజార్‌లో..

తిరుమలగిరి, మే 9 (ఆంధ్రజ్యోతి): భారతదేశం పాకిస్థాన్‌పై జరుపుతున్న యుద్ధంలో సైనికులు సుభిక్షంగా ఉండాలని బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో కమిషనర్ ఆదేశాల మేరకు కార్యనిర్వాహణ అధికారి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, అర్చనలు చేశారు. బొల్లారం అయ్యప్ప స్వామి దేవాలయంలో గణపతి హోమం, మహా సుదర్శన మంత్రజపం, మృత్యుంజయ హోమం, భగవతి సేవ విత్ దేవి మహత్యం, లలిత సహస్రనామ జపం నిర్వహించారు.

ఎస్పీ రోడ్డులో..

బేగంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత సైనికులకు మద్దతుగా తెలంగాణ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్‌లోని ఎస్పీ రోడ్డులోని శ్రీ వీర హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస శర్మ నేతృత్వంలో హోమాలు, పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ ప్రధాన పూజారి భద్రినాద్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



బొల్లారం డౌటన్ బజార్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు

ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో..

సికింద్రాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యానికి మద్దతుగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జవాన్లకు మరింత ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తూ శుక్రవారం ఆలయ కార్యనిర్వహణాధికారి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నాయకుడు బీర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ కార్యనిర్వహణాధికారి

పౌరులు అప్రమత్తంగా ఉండాలి

అమీర్‌పేట, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో పౌరులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్‌నగర్ పోలీసులు సూచించారు. అసాంఘిక శక్తుల సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని, వదంతులను నమ్మవద్దని కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆలయాలు, మసీదుల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో కలిసి ఏసీ పీ బాలగంగిరెడ్డి మాట్లాడారు. ప్రార్థనాలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, కాపలాదారులను నియమించుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ బాలగంగిరెడ్డి



ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలకు బెంచీలు అందజేస్తున్న సీఎంఆర్ స్కూల్ యాజమాన్యం

ప్రభుత్వ గిరిజన పాఠశాలకు బెంచీల ప్రదానం

బోయినపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను ఆదుకోవడానికి అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయడంలో తాము సైతం చేయూత అందిస్తామని బోయినపల్లి సీఎంఆర్ ఉన్నత పాఠశాల డైరెక్టర్ ఎస్.కె రెడ్డి అన్నారు. బోయినపల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ లాలూనాయక్ విజ్ఞప్తి మేరకు బోయినపల్లి సీఎంఆర్ విద్యాసంస్థల అధిపతి సీఎచ్ గోపాల్ రెడ్డి సహకారంతో హైస్కూల్ విద్యార్థుల కోసం శుక్రవారం బెంచీలను సీఎంఆర్ పాఠశాల డైరెక్టర్ ఎస్‌కే రెడ్డి, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ లాలూనాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా లాలూనాయక్ సీఎంఆర్ విద్యాలయాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎస్‌కె రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యా సౌకర్యాలు మెరుగుపరచడానికి తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. తాము కూడా ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలోనే చదవుకున్నవారమేనని, అందుకే తాము ఉన్నత స్థాయిలో స్థిరపడటం జరిగిందన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతి కోసం నిత్యం సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండు పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెనిన్ గైనకాలజీ విభాగంలో వెయ్యికి పైగా రోబోటిక్ శస్త్ర చికిత్సలు

- అపోలో ఆస్పత్రి వైద్యురాలి ఘనత



మాట్లాడుతున్న అపోలో ఆస్పత్రుల గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా.సంగీతరెడ్డి

బంజారాహిల్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): బెనిన్ గైనకాలజీ వైద్య చికిత్సలో వెయ్యి కంటే ఎక్కువ రోబోటిక్ సర్జరీలు చేసి జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రూమా రికార్డు సృష్టించారు. దేశంలోనే అత్యధిక సర్జరీలు చేసిన వైద్యురాలిగా నిలిచారు. జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అపోలో గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతరెడ్డి వైద్యురాలిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీలతో రోగులకు సత్వర ఉపశమనం కలుగుతుందన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ, వారి జీవన ప్రమాణాలను ఎలా మెరుగుపరచగలమో డా.రూమా ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. ఆస్పత్రి సీఈఓ తేజస్వీరావు మాట్లాడుతూ నూతన సాంకేతికతలను స్వీకరించడం, తగినస్థాయిలో అమలు పరచడం ద్వారా అపోలో జూబ్లీహిల్స్ ఆస్పత్రి తన స్థాయిని పెంచుకుందన్నారు. రోబోటిక్ గైనకాలజీలో డాక్టర్ రూమా సునిశితమైన విషయాలపై దృష్టి సారించి విజయం సాధించారని తెలిపారు.



చిన్నారులకు క్రికెట్‌లో మెలకువలు నేర్పుతున్న కోచ్ హర్భజన్‌సింగ్ సంధు



బాస్కెట్‌బాల్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్ నయీముద్దీన్

సందడిగా క్రీడా ప్రాంగణాలు

అమీర్‌పేట, మే 9 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాంగణాలు విద్యార్థులతో సందడిగా మారాయి. అమీర్‌పేటలోని శ్రీ గురుగోవిందసింగ్ మల్టీపర్పస్ స్టేడియం, ధరంకరం రోడ్డులోని జీహెచ్ఎంసీ మైదానం, ఎస్ఆర్ నగర్ వాటర్‌ట్యాంక్ సమీపంలోని జీహెచ్ఎంసీ మైదానంలో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, జిమ్, జిమ్నాస్టిక్స్, కరాటే, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, చదరంగం, రోలర్ స్కేటింగ్, హాకీ తదితర క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లు శిక్షణ ఇస్తున్నారు. కొన్నిచోట్ల యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. వీటిని జీహెచ్ఎంసీ క్రీడా విభాగం ఇన్‌స్పెక్టర్ మాధవి పర్యవేక్షిస్తున్నారు.

బాస్కెట్‌బాల్ కోర్టు వద్ద బారులు

ఎస్ఆర్‌టీకాలనీలోని బాస్కెట్‌బాల్ కోర్టులో విద్యార్థులు బారులు తీరుతున్నారు. తెల్లవారుజామునే ఇక్కడకు చేరుకుంటున్నారు. జీహెచ్ఎంసీ కోచ్ జాతీయ ఆటగాడు మహ్మద్ నయీముద్దీన్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతోంది. మహ్మద్ సయీద్ ఇబ్రాహిమ్, విష్ణు తదితర కోచ్‌లు శిక్షణలో సహకారం అందిస్తున్నారు. ఇక రోలర్ స్కేటింగ్‌లో శిక్షణ పొందే చిన్నారులతో జీహెచ్ఎంసీ గురుగోవిందసింగ్ స్టేడియం సందడిగా మారింది. కోచ్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులకు స్కేటింగ్ శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ స్టేడియంలో బ్యాడ్మింటన్, చదరంగం, క్యారమ్స్, జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో హాకీ, కరాటేలో శిక్షణ కొనసాగుతోంది. జూన్ 6వ తేదీ వరకు వేసవి క్రీడా శిబిరాలు కొనసాగుతాయని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.